సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ చౌరస్తా వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి తమ పార్టీ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని అందులో భాగంగానే ప్రజా దర్బార్ , ఇంటింటికీ మజ్లిస్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా టోలిచౌకీ పరిసరాలకు చెందిన పలువురు తమ తమ సమస్యలను ఆయనకు తెలిపారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు ఆరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, మజీద్ ఖాన్ తదితరులున్నారు.

సమాజ సేవ కోసం గ్రామబాట



గోల్కొండ: సమాజ సేవ కోసం తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ గ్రామబాట పట్టిందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీలక్ష్మి అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హుమేరా సైయిద్‌తో కలిసి ఆమె శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి సేవా కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహిస్తామని విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..మన్‌సాన్‌పల్లిలో ఈ నెల 14వ తేదీ వరకు ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానికులతో కలిసి గ్రామం మొత్తంలో మొక్కలు నాటుతామన్నారు. అదే విధంగా పరిశుభ్రత, ఆరోగ్యం అనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తామన్నారు.

గోషామహల్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీసీపీ



డీసీపీకి మొక్కను అందజేస్తున్న ఏసీపీ సుదర్శన్

అబిడ్స్: గోషామహల్ డివిజన్ కార్యాలయాన్ని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ తనిఖీ నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా 2025వ సంవత్సరం తనిఖీలను శనివారం ఆయన చేపట్టారు. డివిజన్ పరిధిలోని రికార్డులను తనిఖీలు చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. డివిజన్ నలుమూలలా క్రైం రేట్ తగ్గడం, శాంతి భద్రతల పరిరక్షణకు డివిజన్ పోలీసులు చేస్తున్న విధానాలకు గాను ఏసీపీ సుదర్శన్‌ను డీసీపీ ప్రశంసించారు. డివిజన్‌లోని మంగళ్‌హాట్, గోషామహల్ పోలీస్‌స్టేషన్ల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణ, శాంతియుత వాతావరణం, డివిజన్ పోలీసులు చేపడుతున్న బందోబస్తు, పెట్రోలింగ్, సీసీ కెమెరాల పనితీరు, సీసీ కెమెరాల వివరాలను డీసీపీ చంద్రమోహన్‌కు ఏసీపీ సుదర్శన్ వివరించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



డాక్టర్ గౌతంరావును సత్కరించిన సోమ్రాజ్ సింగ్ తదితరులు

అబిడ్స్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని గోషామహల్ డివిజన్ బీజేపీ ప్రెసిడెంట్ సోమ్రాజ్ సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా శనివారం అబిడ్స్ కట్టెలమండి బీజేపీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గౌతంరావును సోమ్రాజ్ సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సోమ్రాజ్ సింగ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎలాంటి హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

దీపావళి వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం

- వేడుకలకు సిద్ధమవుతున్న చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం
- ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పూజలు
- భక్తులకు 2 రోజుల పాటు ఖజానా పంపిణీ
- ఇప్పటికే గవర్నర్‌తో పాటు మంత్రులు, ప్రముఖులకు ఆహ్వానం



భాగ్యలక్ష్మి అమ్మవారు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వానపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయంలో ఈసారి దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యల నడుమ 6 రోజుల పాటు ఇక్కడ వేడుకలు జరుగనున్నాయి. గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..ఇలా పలువురు ప్రజాప్రతినిధులతో పాటు కేంద్ర మంత్రులు కూడా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇక ఉత్సవాల్లో భాగంగా భాగ్యలక్ష్మి అమ్మవారి ఖజానా పంపిణీకి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అమ్మవారి ఖజానా పొందేందుకు భక్తులు ఆలయం నుంచి పత్తర్‌గట్టి కమాన్ వరకు క్యూ కడతారు. ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి తగిన బందోబస్తు నిర్వహించనున్నారు దక్షిణ మండలం పోలీసులు. అవసరమైన మేరకు ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

ఈ నెల 18 నుంచి 23 వరకు..

భాగ్యలక్ష్మి ఆలయంలో ఈసారి ఉత్సవాలు ఈ నెల 18న ప్రారంభమై 23వ తేదీతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న ధన్‌తేరస్‌ను పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు హారతి, మొదటి దర్శనం ప్రారంభమై..రాత్రి 11.30 గంటలకు దర్శనం బంద్ అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ట్రస్టీలు పలువురు మంత్రులను కలిసి ఆహ్వానపత్రాలను అందజేస్తున్నారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈనెల 19న నిర్వహించనున్న చోటా దీపావళి (నరక చతుర్దశి)ని పురస్కరించుకొని భక్తులకు అమ్మవారి ప్రథమ దర్శనం ఉంటుంది. అప్పటి నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనం కొనసాగనున్నట్లు ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు. దీపావళి పండుగకు అమ్మవారు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. ఇక 20న అమ్మవారి భక్తులకు ఖజానాను పంపిణీ ప్రారంభించి రాత్రంతా అందజేయనున్నామని..ఈ పంపిణీ మరుసటి రోజైన 21 రాత్రంతా కొనసాగుతుందన్నారు. 22న గోవర్ధన పూజ, 23న భాయి దూజ్ తదితర పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ ట్రస్టీ శశికళ

గవర్నర్‌తో పాటు ప్రముఖులకు ఆహ్వానం..

ఈ నెల 20న జరిగే అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆలయ ట్రస్టీ శశికళ ఆహ్వానపత్రం అందజేశారు. అలాగే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు, ఉన్నతాధికారులకు కూడా ఆహ్వానం అందజేశారు. దీపావళి పండుగకు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరామని ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు.

తరగతి గదులు ప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తున్న నిరంజన్

యాకుత్‌పురా: రిఫా-యె-ఆమ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన అనేక మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రముఖులుగా రాణిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. హరిబౌలీలోని రిఫా-యె-ఆమ్ ప్రభుత్వ ఎయిడేడ్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన అయిదు తరగతి గదులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..విద్యాబుద్ధులు నేర్చుకున్న ఈ పాఠశాలలో అనేక అంశాలను తెలుసుకొని రాజకీయ నాయకుడిగా, వక్తగా ఎదిగి ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి, బహదూర్‌పురా డిప్యూటీ ఈఓ పోమ్యానాయక్, పాఠశాల కరస్పాండెంట్ పుల్లారెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రామారావు, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయ్‌భాస్కర్, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి



ఉదయ్ కిరణ్

నాంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, బీజేపీ నేత డాక్టర్ దేరంగుల ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. జీ.ఓ నంబరు 9 పై తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ లోపభూయిష్ట విధివిధానాలే కారణమని ఆరోపించారు. శనివారం నాంపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సర్కారు చిత్తశుద్ధి లేకుండా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను పావుగా వాడుకుంటోందని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో 57 శాతం రిజర్వేషన్ల కోసం బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని, బీజేపీ ఎల్లప్పుడూ రిజర్వేషన్లకు మద్దతుగా నిలుస్తుందని వివరించారు.

రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2025 విజేత ఉమర్ పహిల్వాన్



ఉమర్ పహిల్వాన్‌కు వెండి గదను బహూకరిస్తున్న దత్తాత్రేయ తదితరులు

సుల్తాన్‌బజార్: మూడవ వార్షిక బాబయ్య రెజ్లింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ టైటిల్-2025 విజేత ఉమర్ పహిల్వాన్‌ను హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, జ్ఞానేశ్వర్, ఒలింపిక్ రజత పతకం విజేత యోగేశ్వర్, దత్తు, సంతోష పహిల్వాన్ ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..పహిల్వాన్లు తమ ప్రతిభను కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే విధంగా పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉమర్ పహిల్వాన్‌కు వెండి గదను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ పహిల్వాన్, అభిమన్యు పహిల్వాన్, గులాబ్ సింగ్ పహిల్వాన్, విజయ్ పాల్గొన్నారు.

పార్టీని మరింత పటిష్టం చేసే నాయకుడినే నియమించాలి



అమీన్‌పటేల్‌ను సత్కరిస్తున్న పులిపాటి రాజేష్ కుమార్ తదితరులు

చార్మినార్: పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు అందరినీ కలుపునిపోయే విధంగా ఉండే నాయకుడికే హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని పాతబస్తీ బహదూర్‌పురా నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరారు. మేరకు ఏఐసీసీ పరిశీలకులుగా గాంధీ భవన్‌కు వచ్చిన అమీన్ పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్య లాల్, సయెద్ షా ముజాహిద్, సయెద్ ఇక్బాల్, జబ్బార్, అలీ షాన్, ఫయాజ్, భాను చాంద్ యాదవ్, నసీర్ ఫారూఖ్, జాకేర్ హుస్సేన్, ఇర్ఫాన్, హమీద్ ఉద్దీన్, ఇబ్రహీం, అహ్మద్ తదితరులున్నారు.

పికిల్‌బాల్‌కు మంచి ఆదరణ



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్ బాబు

గన్‌ఫౌండ్రీ: పికిల్ బాల్‌కు ఆరాంభంలో కాస్త ప్రతికూల వాతావారణం కనిపించినా ప్రస్తుతం అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు దుదిళ్ల శ్రీనివాస్‌బాబు తెలిపారు. హైదరాబాద్ పికిల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పికిల్ బాల్ ఓపెన్ టోర్నమెంట్‌ను శనివారం ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పికిల్‌బాల్‌ను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలు, పురుషులు, డబుల్స్ విభాగాలలో 200 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.కొమ్మరాజు, శ్రీధర్, నిర్వాహకులు కార్తీక్, సత్యదీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయదారులకు లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు డీసీపీ మహ్మద్ మజీద్

చాంద్రాయణగుట్ట: బాణాసంచా విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని దక్షిణ మండలం అదనపు డీసీపీ మహ్మద్ మజీద్ తెలిపారు. ఛత్రినాక డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, విక్రయదారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రమాదాలకు తావులేకుండా ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించాలన్నారు. అజాగ్రత్తల కారణంగా గతంలో ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. దీపావళి రోజున ప్రజలు కూడా జాగ్రత్తల నడుమ బాణాసంచాను కాల్చాలన్నారు. ఈ సమావేశంలో ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు కె.ఎన్.ప్రసాద్ వర్మ, మహేష్ గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నూతన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా పూజలు, హోమాలు, పారాయణం, అభిషేకం, రుద్రహోమం, సర్వతోభద్ర మండప పూజలు, మూలమంత్ర హోమాలు, సప్త ధాన్యాధివాసం, హారతి తదితర పూజా కార్యక్రమాలను వేదాంతం రాజసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన, ఫల పుష్ప, శయ్యాధి వాసం, హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి విగ్రహ గ్రామ సేవ (ఊరేగింపు)ను గౌలిపురాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ దాతలు అల్లం మధుశ్రీ, అల్లం శ్రీనివాస్‌రావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మహ్మద్ షాదాబ్ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం..నవాబు సాహెబ్ కుంట ప్రాంతానికి చెందిన మహ్మద్ షాదాబ్(35) ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుంది.

నేడు పల్స్ పోలియో

విజయనగర్ కాలనీ: నేడు పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని విజయనగర్‌కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అనుపురం ప్రియాంక అన్నారు. శనివారం విజయనగర్ కాలనీలోని యూపీహెచ్‌సీ కేంద్రంలో వైద్యాధికారులతో కలిసి ఆశా వర్కర్లకు, పారా మెడికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 12, 13, 14వ తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని 29 ప్రత్యేక పోలియో వ్యాక్సిన్ పంపిణీ బూత్‌లను ఏర్పాటు చేసి 4857 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

5ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి..

యాకుత్‌పురా: 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వైద్యారోగ్య శాఖ యాకుత్‌పురా-01 యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఫర్హనాజ్ సూచించారు. శనివారం యాకుత్‌పురాలోని కేంద్రాంలో ఆమె మాట్లాడుతూ..తమ కేంద్రం పరిధిలో మొత్తం 5308 మంది చిన్నారులకు గాను 27 ప్రత్యేక వ్యాక్సిన్ చుక్కల పంపిణీ బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికుల సౌకర్యార్థం యాకుత్‌పురా రైల్వేస్టేషన్‌లో ట్రాన్సిట్‌తో పాటు ఓ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా పాతబస్తీ నాయకులకే అవకాశం ఇవ్వాలి



ఏఐసీసీ అబ్జర్వర్ అమీన్‌పటేల్‌ను సత్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

చార్మినార్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా స్థానికులకే అవకాశం కల్పించాలని కోరుతూ పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏఐసీసీ అబ్జర్వర్, మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే అమీన్ పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన మూసాబౌలిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్ వలీఉల్లా, చార్మినార్ ఇన్‌చార్జి ముజీబుల్ల షరీఫ్ తదితర నియోజకవర్గం ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలి అని నాయకులతో అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ నాయకుడు, మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ అమీన్‌పటేల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజర్స్ బి.సాజన్యగౌడ్, ఇర్ఫాన్ అలీ, మొహమ్మద్ గౌస్, కాంగ్రెస్ నాయకులు మూసా ఖాసీం, హైదర్ అలీ జాఫ్రీ, అస్లాం షరీఫ్, సురేష్ బాబు పాల్గొన్నారు.

ముగిసిన ‘కళా ఉపాసన’



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కూచిపూడి నాట్య శిక్షణాలయం నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ‘కళా ఉపాసన’ పేరిట రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు ముగిశాయి. ఈ సందర్భంగా సిలికాన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పి.రమాదేవి మాట్లాడుతూ..దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులను ఒక దగ్గర చేర్చి ఆయా ప్రాంత కళాకృతులను ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు నృత్య కళాకారులు అమృతలహరి, వేంకట దీక్షితులు, లాస్య కలపలు తమ నత్య ప్రక్రియలతో ఆధ్యాత్మిక భావనను కలిగించారు. అనంతరం పలువురు నృత్య కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిలికాన్ ఆంధ్ర ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ కైలాష్, సంస్థ వ్యవస్థాపకురాలు లక్ష్మీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



గౌతంరావును సన్మానిస్తున్న నాయకులు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉమామహేందర్

చాంద్రాయణగుట్ట: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్.గౌతం రావును భాగ్యనగర్ జిల్లా నాయకులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల పండరీనాథ్, మహేందర్, ఆదర్ల మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, కామాటీ మహేష్, ఈశ్వర్‌యాదవ్, నవీన్, రమేష్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమామహేంద్ర ఆధ్వర్యంలో..

చార్మినార్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.గౌతం రావు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పాతబస్తీ నుంచి పలువురు బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాష్ట్ర పార్టీ కార్యాలయానికి తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర ఆధ్వర్యంలో నాయకులు గౌతంరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బీజేపీ నాయకులు సురేందర్, కునాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బిర్లా సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్ ప్రారంభం



ఏనుగు అవశేషాలను సందర్శిస్తున్న నిర్మల బిర్లా, ఎస్.బలరామ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సింగరేణి మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని తవ్వకాల్లో లభ్యమైన 110 ఏళ్ల నాటి 23 స్టే గోడాన్ జాతి ఏనుగు దంత్తాల అవశేషాలు, డైనోసార్ కాలానికి చెందిన శిలాజ కలపను బిర్లా సైన్స్ సెంటర్‌లో పొందుపరిచారు. శనివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ..నాలుగేళ్ల క్రితం మేడిపల్లి ఓపెన్ క్రాస్ట్ గనిలో మైనింగ్ కార్యక్రమాలు జరుపుతున్న సందర్భంలో రెండు భారీ ఏనుగు దంత్తాలు, దవడ ఎముకలు శిలాజ రూపంలో లభ్యమైనట్లు గుర్తుచేశారు. చరిత్ర పూర్వ యుగానికి చెందిన ఈ అవశేషాలను ప్రజలు, విద్యార్థులు వీక్షించడానికి అనువుగా బిర్లా సైన్స్ సెంటర్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. జీపీ బిర్లా పురావస్తు ఖగోళ, వైజ్ఞానిక సంస్థ చైర్‌పర్సన్ నిర్మల బిర్లా, బిర్లా సైన్స్ మ్యూజియం డైరెక్టర్ కె.మృత్యుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



దేవర వంశీని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శనివారం ఆయన గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డ రాజలింగం స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ క్రీడల్లో జూనియర్, సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

తెలంగాణ పోలీసులు దేశంలోనే నెంబర్ వన్



గోల్కొండ: తెలంగాణ పోలీసులు దేశంలోనే నెంబర్ వన్ అని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహేద్ శనివారం ఆయనను కలిసి డీజీపీగా నియమితులైన సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా నేర నివారణతో పాటు అవినీతి అంతానికి అవకాశం ఉంటుందన్నారు. పోలీసులకు శాంతిభద్రతలు కాపాడడం, స్థానిక ఉత్సావాలను విజయవంతంగా నిర్వహించడంలో స్థానికుల సహాయ సహకారాలు ఉండాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURTS:: AT SECUNDERABAD
OS NO. 750/ 2021

Between:
State Bank of India,
SME Centre Secunderabad ....Plaintiff
And
M/S. Dhani Collection and another ....Defendants

To
1.M/S. Dhani Collection, Rep. by its Prop. Payal Agarwal, Shop No.p1st floor, Orient Estate, Abids, Hyderabad 500 001, TS.
2.Ms. Payal Agarwal, Shop No.p1st floor, Orient Estate Abids, Hyderabad- 500 001, TS.

Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of Rs 4,17,209-00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 07-11-2025 at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

By order of the Court.
Ms. D.K Lakshmi Kumari
[illegible]
Counsel for Plaintiff